



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 235 | ఏప్రిల్ 22 బుధవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





# పచ్చని భూముల్లో కంపెనీల కార్చిచ్చు

**నిషేధిత జాబితాలోకి భూముల సర్వేనెంబర్లు**

**భూ సేకరణ కోసం తతంగం నడిపిస్తున్న సర్కారు**

**ఇండిస్టియల్ కారిడార్ పేరుతో భూములు గుంజుకుంటున్న వైనం**

**ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్న భూమిని కోల్పోతున్న ప్రజలు**

**మన దునియా,వికారాబాద్ జిల్లా,పరిగి,కండ్లాపూర్:ఏప్రిల్ 21**

భూమి అంటే ప్రభుత్వ రికార్డుల్లో ఎకరాల లెక్కలు కాదు. ఓ కుటుంబం తరాల తరబడి ఆస్తి. బతుకుదెరువుకి, పొట్టకూటికి ఆ భూమే ఆధారం. పచ్చని భూమిలో తన చెమట చుక్కలతో బంగారు పంటలు తీసి రైతు సంబురపడతాడు. ఇదంతా ఒకెత్తు అయితే, అభివృద్ధి, పరిశ్రమల పేరుతో పచ్చని పొలాలను 'కంపెనీ భూతం' కబళిస్తే.. ఆ భూమి వెనుక దాగి ఉన్న ఓ కుటుంబం నిశ్శబ్దంగా ముక్కలవుతుంది. ఇప్పుడు ఇండ్రస్టియల్ కారిడార్ కోసం భూములు కోల్పోతున్న రైతులది కూడా ఇదే పరిస్థితి. వికారాబాద్ జిల్లా పరిగి మండలం కండ్లాపూర్, రాపోల్ భూ బాధిత రైతుల కన్నీటి గాథలపై ప్రత్యేక కథనం.

నవతెలంగాణ– రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

అభివృద్ధి పేరుతో ప్రభుత్వం నిర్వహించే భూ సేకరణ అత్యధికంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని భూముల్లోనే జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలోనూ ఎక్కువ భూ సేకరణ ఈ జిల్లాలోనే జరిగింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి రంగారెడ్డి జిల్లానే టార్గెట్‌గా నిలిచింది. అభివృద్ధి పేరుతో ఇక్కడి భూముల్ని కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోం ది. భారత్ ఫ్యూచర్ సిటీ, ఇండిస్టియల్ కారిడార్స్, గ్రీన్ ఫీల్డ్ రోడ్ పేరుతో వేలాది ఎకరాల భూ సేకరణ జరుగుతోంది. వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని కండ్లాపూర్ రాపోలు గ్రామాల్లో 1,197 ఎకరాల భూమిని ఇండిస్టియల్ కారిడార్ కోసం సేకరించేందుకు ప్రభుత్వం ఫారమ్ (సీ ) నోటీసును పబ్లిష్ చేసింది.కండ్లాపూర్ రెవెన్యూ పరిధిలో 587 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, 159 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూములపై ఆధారపడి 350 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రాపోలు గ్రామంలో 509 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా, 101 ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూములపై 300 కుటుంబాలు ఆధారపడ్డాయి. ఇందులో అరెకరం నుంచి ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులే ఉన్నాయి. ఈ రెండు గ్రామాల్లో సుమారు వెయ్యి కుటుంబాలు, 4 వేల మంది జీవనం సాగిస్తున్నారు.

(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడులో ఊహించని ఫలితాలు వస్తాయి: నటుడు విజయ్

**కూటముల లెక్కలు, పార్టీల అంచనాలు తారుమారవుతాయన్న విజయ్**

**విజిల్ సత్తా ఏమిటో ఫలితాలు చెబుతాయన్న విజయ్**

**డీఎంకేను ఇంటికి పంపించేందుకు ఇదే చివరి ప్రచారమన్న విజయ్**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వస్తాయని, కూటముల లెక్కలు, పార్టీల అంచనాలు ఈ ఎన్నికల్లో తారుమారవుతాయని ప్రముఖ సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. విజిల్ సత్తా ఏమిటో ఫలితాలు చెబుతాయని అన్నారు. ఎన్నికల్లో ఒకప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవని అన్నారు. తరం మారిందని, సంప్రదాయ ఓటింగ్ లెక్కలు ఇప్పుడు చిత్తు కానున్నాయని



## కేరళ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ

**కేరళ త్రిస్సూర్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు**

**ఈ దుర్ఘటనలో 13 మంది మృతి, మరో 13 మందికి గాయాలు**



## ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**కాల్పుల విరమణ పొడిగించడం ఇష్టంలేదన్న ట్రంప్**

**ఇరాన్‌కు చర్చలు తప్ప మరో మార్గం లేదని వ్యాఖ్య**

**విరామ సమయంలో అదనపు ఆయుధాలను సమకూర్చుకుంటామని వెల్లడి**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాల్పుల విరమణను పొడిగించడం తనకు ఏమాత్రం ఇష్టం లేదని స్పష్టం చేశారు.



(మిగతా 2వ పేజీలో..)

## 23న క్యాబినెట్ సమావేశం

**'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' ప్రారంభంపై చర్చ**

**పరిషత్ ఎన్నికలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ఆర్టీసీ సమ్మె,ఉద్యోగుల సమస్యలు, యాసంగి ధాన్యం సేకరణపైనా**

**మెట్రోరైలు మొదటి దశ స్వాధీనంపైనా చర్చించే చాన్స్**

**మన దునియా,హైదరాబాద్,ఏప్రిల్ 21**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**(మొదటి పేజీ తరువాయి)**

ఇరాన్‌కు చర్చలు తప్ప మరో మార్గం లేదని, ఒప్పందం కుదుర్చుకోవాల్సిందేనని తేల్చిచెప్పారు. చర్చల నేపథ్యంలో, ఈ విరామ సమయాన్ని వినియోగించుకుని అమెరికా సైన్యం అదనపు ఆయుధ సామాగ్రిని సమకూర్చుకుంటుందని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడులు తిరిగి ప్రారంభించేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని, తాను ఆదేశిస్తే అదే జరుగుతుందని హెచ్చరించారు. తదుపరి చర్చల్లో పురోగతి కనిపిస్తే కాల్పుల విరమణను కొనసాగిస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కాల్పుల విరమణ కొనసాగించాలనుకోవడం లేదని అన్నారు. తమకు అంత సమయం కూడా లేదని తెలిపారు. కాగా, కాల్పుల విరమణ నేడో, రేపో ముగియనుంది.

## తమిళనాడులో ఊహించని ఫలితాలు వస్తాయి: నటుడు విజయ్

**(మొదటి పేజీ తరువాయి)**

జోస్యం చెప్పారు. డీఎంకేను ఇంటికి పంపించేందుకు ఇదే చివరి ప్రచారమని, స్టాలిన్ సర్ ఇంటికే పరిమితమవుతారని జోస్యం చెప్పారు. బీజేపీకి చెందిన ఒక మంత్రి తనను నటుడు అంటున్నారని, నేను నటుడిని అన్న మాట వాస్తవమేనని, కానీ రాజకీయాల్లో మాత్రం నటుడిని కాదని అన్నారు. కానీ వీరు రాజకీయాల్లో నటులు అని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామని చెప్పి బీజేపీ నాయకులు నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఒక్కడిని ఓడించడం కోసం అందరూ ఏకమయ్యారని వ్యాఖ్యానించారు.

## తెలంగాణ జాగృతిలో చేరిన తెలంగాణ టీడీపీ నేత

తెలంగాణ టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు సయ్యద్ అహ్మద్

జాగృతి కండువా కప్పి ఆహ్వానించిన కవిత

త్వరలో పార్టీని ప్రకటించనున్న కవిత



తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకుడు సయ్యద్ అహ్మద్ మంగళవారం తెలంగాణ జాగృతిలో చేరారు. ఆయన రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడిగా ఉన్నారు. ఈరోజు సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తన అనుచరులతో కలిసి ఆయన తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి కవిత జాగృతి కండువా కప్పారు. కల్వకుంట్ల కవిత తన తెలంగాణ జాగృతి సంస్థను త్వరలో రాజకీయ పార్టీగా మార్చబోతున్నారు. అయితే పేరును ఇంకా ఖరారు చేయలేదు. ఈ నెల 25వ తేదీన ఆమె తన పార్టీని ప్రకటించనున్నారు. తెలంగాణ జాగృతి పార్టీ, తెలంగాణ రాష్ట్ర సమితి పేర్లను ఆమె పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వంతో చర్చలు విఫలం.. నేటి అర్ధరాత్రి నుంచి నిలిచిపోనున్న ఆర్టీసీ బస్సులు

ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతల చర్చలు

నాలుగు వారాల సమయం కోరిన ప్రభుత్వ కమిటీ

తమ డిమాండ్లు పాతవేనని స్పష్టం చేసిన జేఏసీ

నేటి అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు ప్రకటించిన జేఏసీ



తెలంగాణ ప్రభుత్వంతో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీనితో ఈరోజు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగనున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. ఐఏఎస్ అధికారుల కమిటీతో జేఏసీ నేతలు చర్చలు జరిపారు. ఈ క్రమంలో డిమాండ్లపై ప్రభుత్వానికి నాలుగు వారాల సమయం ఇవ్వాలని జేఏసీ నేతలను కమిటీ కోరింది. అప్పటి వరకు సమ్మెను విరమించుకోవాలని కోరింది. అయితే ఐఏఎస్ అధికారుల కమిటీ విజ్ఞప్తిని జేఏసీ నాయకులు అంగీకరించలేదు. తమ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. చర్చల అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ, తమ సమస్యలను ఐఏఎస్ అధికారుల కమిటీకి వివరించామని తెలిపారు. వారు నాలుగు వారాల గడువు కోరారని, కానీ తమ డిమాండ్లు కొత్తవి కావని వెల్లడించారు. గతంలో ఇచ్చిన హామీలనే తాము అడుగుతున్నామని అన్నారు. తమ మాట విని నాలుగు వారాలు ఆగాలని కమిటీ కరాఖండిగా చెప్పిందని, దీనితో తప్పనిసరి పరిస్థితుల్లో తాము సమ్మెకు వెళుతున్నామని తెలియజేశారు. 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు తాము సమ్మెను కొనసాగిస్తామని వెల్లడించారు.

# 23న క్యాబినెట్ సమావేశం

**(మొదటి పేజీ తరువాయి)**

నెల 23న జరగనుంది. సచివాలయంలోని ఆరో అంతస్తులో గల క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. సమావేశానికి అవసరమైన సమాచారంతో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం కొనసాగుతోంది. జూన్ 12న ముగియనున్న ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలు నిర్ణయాలను ప్రకటించనుంది.

**క్యాబినెట్ భేటీలో చర్చించనున్న అంశాలు..**

జూన్ 2న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈసారి బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది. దీనికి రూ.4 వేల కోట్లను కూడా కేటాయించింది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ పథకం ప్రారంభ సాధ్యాసాధ్యాలను క్యాబినెట్‌లో పరిశీలించనున్నారు. మే నెలలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను ఖరారు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నాయి. గవర్నర్ కోటా కింద ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన కోదండరాం, అజారుద్దీన్‌లపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి.. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసి ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. ఈ అంశం చర్చకు రావొచ్చు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న అంశం కూడా క్యాబినెట్‌లో చర్చకు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఈ నెల 22 నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ, డీఏలను ప్రకటించడం వంటి అంశాలను జేఏసీ లేవనెత్తుతోంది. ఈ సమస్యలపై క్యాబినెట్ చర్చించవచ్చని సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తోంది. అయినా.. రిటైర్ అయిన ఉద్యోగులకు పూర్తి స్థాయి ప్రయోజనాలు అందడం లేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సమావేశంలో చర్చ జరుగుతుందని సంఘాల నేతలు చెబుతున్నారు. యాసంగి ధాన్యం సేకరణపై క్యాబినెట్ దృష్టి సారించనుంది. ధాన్యం, మొక్కజొన్నల సేకరణ ఎంత జరిగింది, ఇంకా రైతుల వద్ద ఎంత మేర ఉందన్న వివరాలను క్యాబినెట్ ఆరా తీయనుంది. వడగళ్ల వానతో జరిగిన పంట నష్టాలపై క్యాబినెట్ చర్చించనుంది. నిజామాబాద్ వంటి జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి చేతికొచ్చిన వరి ధాన్యాన్ని రైతులు నష్టపోయారు. కల్లాలు, రహదారులపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కుల సర్వే వివరాలను ప్రభుత్వం బయటపెట్టింది. కులాలవారీగా జనాభా, ఆయా కులాల చేతుల్లో ఉన్న భూమి, పేదరికం వంటి వివరాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌పై క్యాబినెట్ చర్చించనుంది. మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవడం, నిధుల చెల్లింపు అంశంతోపాటు కొత్తగా తీసుకురానున్న రోహిత్ వేముల వివక్ష నిరోధక చట్టంపై చర్చించే అవకాశాలున్నాయి.

# పచ్చని భూముల్లో కంపెనీల కార్చిచ్చు

**విలువైన పంటలు సాగు..**

ఈ భూముల్లో గజం జాగా ఖాళీగా ఉండదు. సారమంతమైన నేల కావడంతో బంగారం కంటే విలువైన పంటలను రైతులు పండిస్తున్నారు. మక్కలు, పల్లి, కందులు, మినుములు, జొన్నలు, సజ్జలు, పత్తి, వరి పంటలు, పండ్ల తోటలు మామిడి ఎక్కువగా పండిస్తారు. ఏడాదిలో రెండు పంటలు సాగు చేస్తారు. అయితే ఈ భూములను ఇండస్ట్రియల్ కారిడార్ కోసం తీసుకుంటామని ప్రభుత్వం చెప్పడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భూ సేకరణపై ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేసింది. రైతులకు నేరుగా నోటీసులు ఇవ్వడం కానీ, గ్రామ సభలు పెట్టి చెప్పడం కానీ చేయలేదు. నేరుగా ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బాధిత రైతుల్ని 'నవతెలంగాణ' పలకరించింది. వారి ఆవేదనకు అక్షరరూపం ఇచ్చే ప్రయత్నం చేసింది.

**రైతుల దీనస్థితి**

కండ్లాపూర్ గ్రామంలో గాండ్ల ఫ్యామిలీకి 36 ఎకరాల భూమి ఉంది. వీరు ప్రస్తుతం 15 కుటుంబాలుగా ఉన్నారు. ఒక్కో కుటుంబానికి ఎకరంన్నర, రెండు ఎకరాలు వస్తోంది. వీరికి వ్యవసాయమే జీవనాధారం. వీరి భూమిని ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. వీరిలో రైతు గాండ్ల రవి రెండు ఎకరాల్లో వ్యవసా యం చేస్తున్నారు. ఈయన ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. ఈ రెండెకరాలు ప్రభుత్వ నోటీసుల్లో ఉందని ఊరిలో పెద్దమనుషుల ద్వారా తెలుసుకున్న రవి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ' 45 ఏండ్ల వయస్సులో నేను కుటుంబాన్ని పట్టుకుని ఊరు విడిచి ఎక్కడకు వెళ్లాలిడ ఏ పని చేసి నా పిల్లలను సాకాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూముల జోలికి రావొద్దని మొత్తుకుంటున్నారు. 'ఎమ్మెల్యే సారూ.. మీ కాళు మొక్కుతాం మా భూమి జోలికి రాకండి..' అంటూ బోరున విలపించాడు. రాపోలు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గోపాల్‌ది మరో గాథ. ఉద్యోగ విరమణ తరువాత తన రెండెకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. రిటైర్డ్ సమయంలో వచ్చిన డబ్బులతో పందుల పెంపకం కోసం షెడ్ వేశారు. ఉన్నపళంగా భూమిని ప్రభుత్వం తీసుకుంటుంది అనే వార్తతో ఆ రైతు కండ్లలో కన్నీళ్లు.. గుండెల్లో బాధ తప్ప మరొకటి కనిపించడం లేదు. ' దేశ ప్రజల కోసం నా ప్రాణాలను అడ్డుపెట్టాను. కానీ పిల్లల కోసం భూమిని కాపాడలేక పోతున్నాను..' అంటూ తన ఆవేదనను పంచుకున్నాడు. ఇలా ఏ కుటుంబాన్ని కదలించినా వారి దు:ఖం వర్ణనాతీతం. వీరు తమ భూములు కాపాడుకోవడం కోసం వివిధ రూపాల్లో తమ గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, తమ భూములను తమకే ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**అభివృద్ధి పేరుతో రైతుల బతులకు ఆగం చేయొద్దు**

మా ఊరికి కంపెనీలు కావాలని మేము అడుగలేదు. మాకు ఉద్యోగాలు ఇవ్వమని కోరలేదు. ఈ ప్రాంత ప్రజలకు వ్యవసాయం తప్ప, మరొక పని రాదు. బంగారం లాంటి పంటలు పండే భూముల్లో కంపెనీలు పెట్టొద్దు. బలవంతంగా ఈ భూములు లాక్కొవాలని చూస్తే ఊరుకునేది లేదు. పంటకు అనువుగాలేని భూముల్లో కంపెనీలు పెట్టుకోవాలి. అలాంటి భూములు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. అక్కడకు వెళ్లండి.

## కేరళ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు.. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ

**మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించిన ప్రధాని మోదీ**

**గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం**

**ఘటనపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తీవ్ర విచారం**

కేరళలోని త్రిస్సూర్‌లో ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రధాని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రధాని జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అధికారిక వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో మరో 13 మంది గాయపడగా, వారిని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రసిద్ధ త్రిశూర్ పూరం ఉత్సవాలకు ముందు ఈ దుర్ఘటన జరగడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాదంపై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. సీపీఐ కార్యదర్శి బినోయ్ విశ్వం స్పందిస్తూ, పండుగల సమయంలో ప్రమాదకరమైన పేలుడు పదార్థాల వాడకంపై పండుగ కమిటీలు, మత పెద్దలు పునరాలోచించాలని సూచించారు. ఈ ఘటనతో బాణసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



# రేపట్నుంచే ఆర్టీసీ సమ్మె

**నేటి అర్ధరాత్రి నుంచే నిలిచిపోనున్న బస్సులు**

**ఇదే చివరి సమ్మె కావాలి: జేఏసీ**

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 21**

ఆర్టీసీ కార్మికులు బుధవారం నుంచి సమ్మెకు దిగబోతున్నారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో సమ్మె తథ్యమని స్పష్టమవుతున్నది. ఇదే జరిగితే మంగళవారం అర్ధరాత్రి నుంచే మొదటి డ్యూటీ బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. ఈలోగా సమ్మెను నిరోధించేందుకు ప్రభుత్వం ఏవైనా చర్యలు చేపడితే తప్ప ఈ నెల 22 నుంచి సమ్మె యధాతథంగా కొనసాగుతుందని ఆర్టీసీ కార్మిక సంఘాలు చెప్తున్నా యి. సమ్మె గడువు దగ్గరపడుతున్నా ప్రభు త్వం నుంచి చర్చల ఊసే లేకపోవడంపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ తీసుకోకపోతే కచ్చితంగా సమ్మె జరుగుతుందని తేల్చిచెప్తున్నారు.నిరుడు మే 6న సమ్మెకు దిగనున్నట్టు ప్రకటించిన ఆర్టీసీ కార్మికులతో ప్రభు త్వం చర్చలు జరిపి, సమ్మెకు వెళ్లకుండా అడ్డుకున్నది. ఇప్పుడు ప్రభుత్వంలో ఎలాంటి చల నం లేకపోవడంతో సమ్మెకు వెళ్లడమే సరైన నిర్ణయమని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ భావిస్తున్నది. సమ్మెకు వెళ్తున్న కార్మికులపై పలు డిపోల్లో అధికారులు ఇప్పటికే ఆంక్షలు విధించారు. ఆ ఆంక్షలకు వెరవకుండా సమ్మెకు తరలిరావాలని కార్మికులకు జేఏసీ పిలుపునిచ్చింది. కార్మికులు ఐక్యతతో గట్టిగా పోడాడితే ఆర్టీసీలో ఇదే చివరి సమ్మె అవుతుందని జేఏసీ నేతలు చెప్తున్నారు. తమతో ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరుపకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచే బస్సులు డిపోల్లో ఆగిపోతాయని, బుధవారం ఉద యం నుంచే సమ్మె పూర్తిస్థాయిలో ప్రారంభమవుతుందని చెప్తున్నారు.

**ముఖ్యమంత్రిపైనే భారం**

ఆర్టీసీ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుపై యాజమాన్యం పూర్తిగా చేతులెత్తేసే దిశ గా అడుగులు వేస్తున్నది. అందులో భాగంగా సమ్మె డిమాండ్లతో తమకు ఎలాంటి సం బంధం లేదని లేబర్ కమిషన్‌కు పంపిన లేఖలో స్పష్టం చేసింది. దీంతో సీఎం నేరుగా రంగంలోకి దిగితే తప్ప తమ సమస్యలకు పరిష్కారం లభించదని కార్మికులు భావిస్తున్నా రు. మంగళవారం సాయంత్రంలోగా తమ నాయకులను ప్రభుత్వం చర్చలకు పిలువకపోతే సమ్మె తథ్యమని స్పష్టం చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం




చేయడంతోపాటు కార్మిక సంఘాలపై నిషేధం ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్లు మినహా మిగతా డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం సుముఖంగా ఉన్నట్టు తెలుస్తున్నది. కానీ, ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుండా ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిరోధించడం ఎలాగన్న దానిపై తర్జన భర్జన కొనసాగుతున్నది.

**సమ్మెకు కలిసి వస్తామన్న ఇతర సంఘాలు**

దీర్ఘకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ఎన్నో వినతులు సమర్పించినా స్పందన లేకపోవడంతో తాము సైతం సమ్మెకు కలిసి వస్తామని జేఏసీలో లేని కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, తమ కార్యాచరణ ప్రకటించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు యూనియన్ల పునరుద్ధరించాలని, 2021, 2025 వేతన సవరణ, 2017 పీఆర్సీ బకాయిలు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సహా అన్ని సమస్యలను మంగళవారం మధ్యాహ్నంలోగా పరిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో 22 నుంచి జరిగే సమ్మెకు తాము కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు.

## నేటి అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె!

**మరో సకల జనుల సమ్మెగా మారబోతుందన్న ఆర్టీసీ జేఏసీ నాయకులు**

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 21**

తెలంగాణలో ఆర్టీసీ కార్మి కులు సమ్మెకు సిద్ధమయ్యా రు.తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ నాయకులు తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులు అవు తున్న ఇప్పటికీ ప్రభుత్వం చర్చలు జరుపకపోవడం విచారకరమన్నారు. దీంతో డిమాండ్లను పరిష్కరిం చాలంటూ రేపటి బుధవారం నుంచి సమ్మె చేయాలని టీఎస్ఆర్టీసీ జేఏసీ నిర్ణయించింది. సమ్మెపై ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న ఈరోజు మీడియాతో మాట్లాడుతూ.. రేపటి ఏప్రిల్ 22 నుంచి సమ్మె చేపడుతున్నామని.. సమ్మెకు అన్ని సంఘాలూ మద్దతు తెలిపాయని అన్నారు. ఇప్పటివరకూ ఆర్టీసీ అధికారులు,కాని ప్రభుత్వం కానీ తమను చర్చలకు పిలవలేదని.. కనీసం సమ్మె నివారణ చర్యలు కూడా చేపట్ట లేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ఇప్పటికీ మొదలు పెట్టలేదన్నారు. కాలయాప న కోసమే విలీన కమిటీ వేశారు. కష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వ పరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే మూసి నది అభి వృద్ధి ఎలా చేస్తున్నారని



ఆయన ప్రశ్నించారు. హైదరాబాదులో ఆర్టీసీని లేకుండా చేయాలని, ప్రయత్నిస్తున్నారని ప్రవేటు వ్యక్తులకు ఆర్టీసీ భూముల ను దారా దత్తం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈరోజు తలపెట్టబోయే ఆర్టీసీ సమ్మె మరో సకల జనుల సమ్మెగా మారబోతుందని వారు హెచ్చరించారు.

## అనుమానం పెనుభూతమై....పదేళ్ల బంధం.. పగబట్టిన అనుమానం.. కన్నతల్లి కాటికి.. తండ్రి జైలుకు.. అనాథలైన బిడ్డలు!

**మన దునియా,అన్నమయ్య జిల్లా: ఏప్రిల్ 21**

అన్నమయ్య జిల్లా వాల్మీకి పురంలో భర్త అనుమానం భార్య ప్రాణాన్ని బలి తీసుకుంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలతో భార్య హత్యకు గురి కాగా భర్త జైలు పాలు కాగా ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. తంబళ్లపల్లి మండలం బురజుపల్లికి చెందిన డిగ్రీ చేస్తూ చదువు మానేసిన మౌనికకు వాల్మీకిపురంకు చెందిన జగదీష్ తో 2016 లో పెళ్లయింది. 10 ఏళ్ల కాపురానికి కౌశిక్(9), లోక్షిత(6) ఇద్దరు పిల్లలు ఉండగా వాల్మీకిపురం బస్టాండ్ వద్ద టీ స్టాల్ నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.ఇద్దరి మధ్య పెళ్లైన నాటి నుంచి ఉన్న గొడవలే కంటిన్యూ అవుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలోనే వాల్మీకిపురంను వదిలి బెంగుళూరు వెళ్లిపోయారు. యలహంకలో ఉన్న మౌనిక తండ్రి వద్దకు ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లారు. అక్కడ మౌనిక తండ్రి కూరగాయలు వ్యాపారం చేస్తుండగా, అదే వ్యాపారం చేస్తూ ఇద్దరు పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నారు దంపతులు. ఈ క్రమంలోనే మౌనిక జగదీష్‌ల మధ్య గొడవలు మాత్రం తగ్గలేదు. అల్లుడు జగదీష్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన మౌనిక తండ్రి సుధాకర్ తమ పరువు పోతుందని వెళ్లిపోమన్నాడు. దీంతో ఏప్రిల్ 19వ తేదీన యలహంక నుంచి తిరిగి వాల్మీకిపురం చేరుకున్న ఆ జంటకు అది ఆఖరి ప్రయాణం అవుతుందని ఎవరూ ఊహించలేదు.సొంతూరికి వచ్చిన కొద్ది గంటలకే పాత గొడవలు మళ్లీ మొదలయ్యాయి. సాయంత్రం 4:30 గంటల సమయంలో మాట మాట పెరిగి, కోపంతో ఊగిపోయిన జగదీష్, మౌనిక మెడలోని చున్నీతోనే ఆమె గొంతు నులిమి ప్రాణాలు తీశాడు. కట్టుకున్న భార్యను నిర్జీవంగా మార్చాక, నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మౌనికను హత్య చేసిన విషయం స్థానికుల నుంచి సమాచారం అందడంతో వాల్మీకిపురంకు వచ్చిన మౌలిక తల్లి ఇంట్లో విగత జీవిగా భోరున విలపించింది. అల్లుడిని అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరింది.“అనుమానం గొంతు నులిమింది” అన్న మాట ఇక్కడ అక్షరాలా నిజమైంది. క్షణికావేశం, అపోహలు ఒక కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తాయో చెప్పడానికి ఈ ఘటనే సాక్ష్యం. మౌనిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది కానీ, ఆ పిల్లలకి పోయిన అమ్మను, ఉన్నా లేని నాన్నను ఎవరు తిరిగి ఇవ్వగలరు?



## ఆర్టీసీ సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు: జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం




**మన దునియా జనగామ జిల్లా: ఏప్రిల్ 21**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టనున్న సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా టిఆర్పి శ్రేణులు ఈ సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొంటాయని ఆయన తెలిపారు. జనగామ జిల్లాలో సమ్మెను విజయవంతం చేస్తామని, కార్మికుల పక్షాన నిలబడతామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కట్ల సదానందం మాట్లాడుతూ కార్మికుల దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాటల్లో..ఆర్టీసీ కార్మికులు రేయింబవళ్లు కష్టపడుతూ, తమ రక్తాన్ని చెమటగా మార్చి సంస్థను కాపాడుతున్నారు. ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చే వారధి కార్మికులు. అటువంటి కార్మికుల న్యాయమైన 32 డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండివైఖరి ప్రదర్శించడం దుర్మార్గం. కార్మికులకు కనీస సౌకర్యాలు లేకపోయినా, పని ఒత్తిడితో సతమతమవుతున్నా, కేవలం సంస్థ బాగుండాలనే తపనతో వారు పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిట్టబోయిన నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు బబ్బులు మరియు తదితరులు పాల్గొన్నారు

## కాళేశ్వరం, ఫిరాయింపు కేసులపై బీఆర్ఎస్ కీలక చర్చలుడ సుప్రీంకోర్టు వ్యూహంపై న్యాయ సలహాలు



**మన దునియా,ఢిల్లీ:ఏప్రిల్ 21**

ఢిల్లీ లో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరంతో బీఆర్ఎస్ త్రిసభ్య బృందం సమావేశమైంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఢిల్లీ వెళ్లి ఆయనను కలిశారు. కాళేశ్వరం కమిషన్‌పై త్వరలో రానున్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాలపై వారు చర్చించారు. అలాగే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో న్యాయపరంగా తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణపై కూడా సీనియర్ న్యాయవాది ఆర్యమా సుందరం గారితో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.ఈ సమావేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోవడంతో పాటు, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తీసుకునే న్యాయపరమైన చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## కొత్తగూడలో ఘనంగా హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ

**పాల్గొన్న ఎస్ఐ రాజ్ కుమార్**

**మన దునియా,కొత్తగూడ,ఏప్రిల్ 21**



కొత్తగూడ మండలంలోని హనుమాన్ ఆలయంలో ఈరోజు హనుమాన్ ఉత్సవ విగ్రహ ఆవిష్కరణ వేడుక అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజ్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమంతుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం హనుమాన్ సేవ సమితి కమిటీ సభ్యులు ఎస్ఐ రాజ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... విగ్రహదాతలు ముందుకు రావడం చాలా సంతోషమని అన్నారు. హనుమాన్ సేవ సమితి కమిటి ఎస్ఐ గారికి శాలువా కప్పి, తమ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ఏపీలో ఆపిల్ తో పోటీ పడుతున్న నిమ్మ ధరలు - కేజీ నిమ్మ రూ.200.

మన దునియా,అమరావతి: ఏప్రిల్ 21



ఏపీ రాష్ట్రంలో ఎండలకు మించి నిమ్మ ధరలు మండిపోతున్నాయి.యాపిల్స్ రేట్లతో పోటీ పడుతున్నాయి. నెల్లూరు (జి) గూడూరు మార్కెట్లో ఇవాళ 50 కేజీల బస్తా ఏకంగా రూ.10వేలు పలికింది. గతవారం కేజీ రూ.130-150 ఉండగా ఇప్పుడు రూ.200కు చేరింది.దిగుబడి భారీగా తగ్గిపోవడం, ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కోసం ప్రజలు ఎక్కువగా నిమ్మ రసంపై ఆధారపడటంతో డిమాండ్ పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

## పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్




మన దునియా,సంగారెడ్డి జిల్లా కోహీర్,బిలాల్ పూర్:ఏప్రిల్ 21

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం బిలాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-4) కె. శ్వేతను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు.ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి తోడు ఫేక్ అటెండెన్స్, విధులకు గైర్హాజరుతో పాటు రూ.49 వేల ప్రభుత్వ సొమ్మును వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకున్నారన్న అవినీతి ఆరోపణలను ఆమె ఎదుర్కొంటున్నారు.ప్రస్తుతం ఆమె కోహిర్ మండలం పీచరాగడి ( ఏ )తాండా గ్రామపంచాయతీలో డెప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.గ్రామ సర్పంచ్ చేసిన ఫిర్యాదు మేరకు జహీరాబాద్ డీఎల్పీఓ, కోహిర్ ఎంపీడీవో లకు విచారణ చేపట్టగా.. విధులకు సకాలంలో హాజరు కాకపోవడం, గ్రామ ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయని నివేదికలో పేర్కొన్నారు.


## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు కొత్త మార్గదర్శకాలు!

మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 21

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బదిలీల ప్రక్రియకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొంతకాలంగా పెండింగ్ లో ఉన్న ఈ ఫైల్ పై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం అధికారికంగా జీవో విడుదల చేసింది.

జీవోలోని కీలక అంశాలు:

మే 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు నెల రోజుల పాటు బదిలీల ప్రక్రియ కొనసాగనుంది. ఒకే చోట కనీసం మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. బదిలీల ప్రక్రియ అంతా పారదర్శకమైన నిబంధనల ప్రకారం జరగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.చాలా కాలంగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ఉద్యోగులకు ఈ నిర్ణయం పెద్ద ఊరట నిచ్చింది. మే నెల మొత్తం ఈ ప్రక్రియ సాగనున్న నేపథ్యంలో, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉద్యోగులు తమ కొత్త స్థానాల్లో చేరే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకా లను సంబంధిత శాఖలు త్వరలోనే విడుదల చేయనున్నాయి.




# రిజర్వేషన్ల వివాదం తేలకముందే.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎలా?

**మేలో ఎన్నికల దిశగా కసరత్తు**
**బీసీ రిజర్వేషన్లపై పీటముడి వీడకుండానే మరోసారి ముందుకు**
**ఎస్ఈసీకి సమాచారమిచ్చిన ప్రభుత్వం**

మన దునియా,హైదరాబాద్, ఏప్రిల్ 21

అనాలోచిత నిర్ణయాలతో సెప్టెంబర్‌లో ఒకసారి ప్రయత్నించి చేతులు కాల్చుకున్న ప్రభుత్వం తాజాగా మళ్లీ మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సమాయత్తమవుతున్నది.నాటి అడ్డంకులు పూర్తిగా తొలగిపోనప్పటికీ, ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలన్న ప్రభుత్వ సంకేతాలతో ఎస్ఈసీ కూడా సన్నద్ధమవుతున్నది. తొలుత ఈ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం లేవనెత్తిన బీసీ రిజర్వేషన్ల అంశమే ప్రధాన సమస్యగా మారిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఈ వివాదం పరిష్కారం కాకముందే ముందుకు వెళ్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు, బీసీ రిజర్వేషన్ల శాతంపై హైకోర్టులో కేసు తేలాల్సి ఉన్నది. బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయడం, న్యాయపరమైన చిక్కులను అధిగమించడం ప్రభుత్వానికి కత్తిమీద సాముగా మారింది. ఇవి పరిష్కరించకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారనేది ఉత్కంఠ రేకెత్తిస్తుండగా, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం చేసిన సూచనలు అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. దీంతో మరోసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**23న క్యాబినెట్‌లో నిర్ణయం!**

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు చివరిసారిగా 2019 మేలో జరిగాయి. 2019 మే 6, 10, 14వ తేదీల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి, జూన్‌లో ఎంపీపీలు, జడ్పీ చైర్మన్ల ను ఎన్నుకున్నారు. గత సంవత్సరం జూన్‌లో వారి పదవీకాలం ముగిసింది. నాటినుంచి స్పె షల్ ఆఫీసర్ల పాలనతో నెట్టుకొస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 29న రెండు దశల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీచేసి నామినేష న్లు స్వీకరించారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణలో భాగంగా అక్టోబర్ 9న హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత న్యాయస్థానం అనుమతితో ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. రిజర్వేషన్ల విధానం ప్రకటించిన అనంతరం అందుకు అనుగుణంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 23న క్యాబినెట్‌లో చర్చిం చి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. మంత్రివర్గ సమావేశంలో రిజర్వేషన్లపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఇదే విషయాన్ని హైకోర్టుకు నివేదించనున్నట్టు తెలిసింది. ఈలోగానే ఎన్నికల ప్రక్రియలో వేగం పెంచేందుకుగాను గత సంవత్సరం జూలై 10వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 5 నాటికి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన




జాబితాతో నియోజకవర్గాల వారీగా అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తిస్తున్నారు. వీటి ఆధారంగానే తుది ఓటర్ల జాబితా ఖరారు చేసి ఎన్నికలను ప్రామాణికంగా తీసుకోనున్నారు. అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 23ను గడువుగా నిర్దేశించారు. ప్రభుత్వ ఆమోదం తర్వా త జాబితాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శిస్తారు. ఇదే జాబితాతో ఎన్నికలకు వెళ్లనున్నారు.

**తగ్గిన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు**

ప్రభుత్వ ఆదేశాలతో సంబంధిత శాఖలు ప్రక్రియను ప్రారంభించి 5,773 ఎంపీటీసీ, 566 జడ్పీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు వీలుగా జాబితాను సిద్ధంచేసి సీఎస్‌కు సమర్పించారు. సీఎస్ ఈ నివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల తగ్గుదల వెనుక మేడ్చల్-మల్కాజిగిరిని అర్బన్ జిల్లాగా గుర్తిం చి జిల్లా పరిషత్ జాబితా నుంచి తొలగించడంతోపాటు, పలు జిల్లాల్లో మున్సిపాలిటీలు కార్పొరేషన్లలో కొన్ని గ్రామాలు విలీనం కావ డం కారణం. ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. 2019 తర్వాత సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అనేక గ్రామ పంచాయతీల విలీనంతో 44 ఎంపీటీసీలు, నాలుగు జడ్పీటీసీ, మరో 4 ఎంపీపీ స్థానాలు తగ్గిపోయాయి. ఎన్నికలకు వెళ్లాలంటే ముందు గా బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి కసరత్తు చేయలేదు. ప్రస్తుతం రిజర్వేషన్ల వివాదం హైకోర్టు లో విచారణలో ఉన్నది. తాజాగా అదనపు ఓటర్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి పోలింగ్ కేంద్రాల వారీగా జత చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే జరిగితే తీవ్రమైన ఎండలు ఠారెత్తించే మే నెలలో ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పోలింగ్ శాతం తగ్గడం, వేసవిలో నీటి ఎద్దడి, కరువు పరిస్థితుల వంటివి కూడా ప్రభావం చూపే అవకాశం ఉన్నది.

# వార్షిక తనిఖీల్లో భాగంగా మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ





మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:ఏప్రిల్ 21

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడం ఈ తనిఖీ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ సందర్భంగా “వన మహోత్సవం” కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం స్టేషన్ ప్రాంగణ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ । బుధవారం । 22 । 2026


# ఆదిలాబాద్ రిమ్స్ లో ఎంప్లాయిమెంట్ పెంచాలి ఖానాపూర్ ఎమ్మెల్యే






**రిమ్స్ హెల్పడెస్క్ సిబ్బందిని ట్రైబల్ ప్రజలకు అందుబాటులో ఉంచాలి వెడ్మ బొజ్జు పటేల్ :-**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) ఏప్రిల్: 21.**

ఆదిలాబాద్ రిమ్స్ హెచ్ డి ఎస్ మీటింగ్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధ్యక్షతన జరగగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు . ఆయన మాట్లాడుతు రిమ్స్ ఆసుపత్రికి ఏజెన్సీ ప్రాంతాల నుండి వస్తున్న రోగులను చిన్న వాటికి కూడా నిజామాబాద్ , హైదరాబాద్ రిఫర్ చేయకుండా ఇక్కడే ట్రీట్మెంట్ అందేలా చూడాలి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రిక్రూట్మెంట్ లో మాకు కూడా అవకాశం కల్పించాలని కలెక్టర్ ని కోరారు.రిమ్స్ ఆసుపత్రి లో నూతన యంత్రాలను కలెక్టర్,ఎంపీ తో కలిసి టెంకాయ కొట్టి , రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఉట్నూర్ హాస్పిటల్ లోనే డెలివరీ అయ్యే విధంగా సిబ్బంది , సౌకర్యాలు కల్పించాలి. మరియు మార్చారి నిర్మాణం చేపట్టాలి , మదర్ హాస్పిటల్ నిర్మించాలి .రిమ్స్ ఆసుపత్రి హెల్పడెస్క్ సిబ్బంది నీ యాక్టివ్ చేసి ట్రైబల్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి , హాస్పిటల్ లో ఎంప్లాయిమెంట్ పెంచి సిబ్బంది ప్రజలకు అండగా ఉండాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి వస్తున్న వారిని హైదరాబాద్ రిఫర్ చేయకుండా రిమ్స్ లోనే చికిత్స అందేలా చూడాలి . ప్రతి మూడు నెలలకు హెచ్ డి ఎస్ మీటింగ్ నిర్వహించాలి, అంబులెన్సులు అందుబాటులో ఉంచి మరిన్ని పెంచేందుకు ప్రపోజల్ పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్ , రిమ్స్ సిబ్బంది, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని పలు మండలాల్లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే





**ఖానాపూర్ ఆర్సి మన దునియా (ప్రతినిధి శరత్) ఏప్రిల్: 21.**

ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలం నాగపూర్ దాల్మిల్ , ఇంద్రవెల్లి మండలంలోని మార్కెట్ యార్డులో మార్క్ ఫేడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న మరియు జన్నారం , కడెం మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ , ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు దరకి ధాన్యాన్ని కొన్ని రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మార్క్ ఫేడ్ సంస్థ ద్వారా ప్రభుత్వమే రైతుల గిట్టుబాటు అయ్యే రేటుకే మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు , సంస్థ ,సిబ్బంది రైతులు , కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# : ఒక ఓటుకు రూ. 25,000 ఇచ్చారా? రాత్రికి రాత్రే లక్షాధికారులైన ఓటర్లు? కలకలం రేపుతున్న ధనిక అభ్యర్థి తీరు!

**మన దునియా,తమిళనాడు: ఏప్రిల్ 21**

తమిళనాడు మధ్య భాగంలోని ఒక నియోజకవర్గానికి చెందిన ఒక ధనిక అభ్యర్థి, ఒక్కో ఓటుకు ఏకంగా రూ. 25 వేల చొప్పున పంపిణీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసి సదరు నియోజకవర్గంలో ఆయనపై పోటీ చేస్తున్న ఇతర అభ్యర్థులు షాక్‌కు గురయ్యారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న జరగనున్నాయి. వీటికి సంబంధించిన ప్రచారం రేపు సాయంత్రంతో ముగియనుంది. సమయం తక్కువగా ఉండటంతో రాజకీయ పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, బహుమతులను స్వాధీనం చేసుకుంటున్నారు.అయితే, ఎన్నికల అధికారుల కళ్లు గప్పి అభ్యర్థులు భారీగా నగదు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బును నీళ్లలా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. అక్కడక్కడా ఒక ఓటుకు రూ. 1000, రూ. 1500, రూ. 5000 వరకు ఇస్తుండగా.. ఒక ధనిక అభ్యర్థి మాత్రం ఏకంగా రూ. 25 వేలు పంపిణీ చేస్తున్నారట.రూ. 500 కోట్ల పంపిణీ? సదరు నియోజకవర్గంలో సుమారు 2 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు అంచనా. ఆ లెక్కన చూస్తే, కేవలం ఓట్ల కోసమే ఆయన దాదాపు 500 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉండవచ్చని తెలుస్తోంది. ఒక ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే, ఆ కుటుంబానికి ఏకంగా రూ. 1 లక్ష వరకు అందుతోంది. దీనికి పోటీగా ప్రత్యర్థి అభ్యర్థి రూ. 6000 చొప్పున పంచుతున్నారట. అయితే ధనిక అభ్యర్థి ఇస్తున్న భారీ మొత్తంతో పోలిస్తే తన గెలుపు సాధ్యమేనా, తాను పంచిన రూ. 6000 వృథా అవుతుందా అని ఆయన ఆందోళన చెందుతున్నారట.స్వతంత్ర అభ్యర్థుల ఆవేదన: చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారి కుటుంబ సభ్యులకు కూడా ఆ ధనిక అభ్యర్థి నుండి రూ. 25 వేలు అందడంతో.. "కనీసం మన కుటుంబం మనకు ఓటు వేస్తుందా?" అనే అనుమానం వారిలో మొదలైంది. దీంతో పార్టీలకతీతంగా అభ్యర్థులందరూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఆ ధనిక అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించాలని యోచిస్తున్నారు.ఏది ఏమైనప్పటికీ, ఓటుకు డబ్బు ఇవ్వడం ఎంత నేరమో.. ఆ డబ్బును తీసుకోవడం అంతకంటే పెద్ద నేరం. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును నగదుకు అమ్ముకోకుండా, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



# కమలాపూర్ మండల అభివృద్ధికి నిధులు కోరిన నాయకులు

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసిన ప్రతినిధులు



**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

కమలాపూర్ మండల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మండల నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్,ని మర్యాదపూర్వకంగా కలిశారు.మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయిన నేపథ్యంలో వెంటనే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి బండి సంజయ్ కుమార్ గ మండల అభివృద్ధికి అవసరమైన నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు.అదే విధంగా, వచ్చే నెలలో కమలాపూర్ మండలాన్ని స్వయంగా పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.ర్యాకం శ్రీనివాస్,మండల అధ్యక్షుడు, జట్టి సారంగపాణి,ప్రధాన కార్యదర్శి, ఇనుగాల రత్నాకర్,ఉపాధ్యక్షుడు భూపతి ప్రవీణ్,మండల నాయకుడు, జక్కుల రమేష్,మహంకాళి, తదితరులు పాల్గొన్నారు. కమలాపూర్ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల హామీ త్వరలో మండల పర్యటనకు సిద్ధమైన మంత్రి స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి

# ఏసీబీ వలలో వికారాబాద్ మహిళా సీఐ, ఎస్సై!

**మన దునియా,వికారాబాద్: ఏప్రిల్ 21**




బాధితులకు అభయం ఇవ్వాల్సిన ఖాకీలే లంచాలకు కక్కుర్తి పడి కటకటాల పాలయ్యారు. వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ బి. సరోజ, సబ్-ఇన్‌స్పెక్టర్ హెచ్. రాణి ఒక కేసు దర్యాప్తులో నోటీసులు జారీ చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి ఏకంగా రూ.60 వేలు లంచం డిమాండ్ చేశారు. తీరా బేరసారాల అనంతరం ఆ మొత్తాన్ని రూ.40 వేలకు తగ్గించుకుని, పోలీస్ స్టేషన్ సాక్షిగా ఇన్‌స్పెక్టర్ ముందే ఎస్సై రూ.20 వేలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. లంచం కోసం పదేపదే వేధిస్తుండటంతో విసిగిపోయిన బాధితుడు నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఏసీబీని ఆశ్రయించగా, పక్కా వలపన్నిన అధికారులు ఈ ఇద్దరు అధికారుల బండారం రట్టు చేశారు. రక్షక భటులే భక్షకులుగా మారిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపగా, ప్రస్తుతం దీనిపై ఏసీబీ విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది.

# ఈ సమస్య ఉన్నా సరైన తిండి తింటే బరువు తగ్గడం పెద్ద కష్టమేం కాదట

పీసీఓఎస్ ఒకసారి వచ్చిన తర్వాత చాలా కాలం పాటు సమస్యలు కలిగిస్తుంది. ఇది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా బరువు పెరగడం చాలా సాధారణం. కొంతమంది మాత్రం బరువు తగ్గలేమనుకుంటారు. కానీ ఇది కరెక్ట్ కాదు. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో బరువును తగ్గించవచ్చు.పీసీఓఎస్ ఉన్న వారిలో ఇన్సులిన్ హార్మోన్ సరిగా పని చేయదు. దీని వలన గ్లూకోజ్ స్థాయిలు పెరిగి శరీరానికి ఇన్సులిన్ తగిన విధంగా స్పందించదు. దీని ఫలితంగా శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఇలా శరీర బరువు పెరుగుతుంది. అయితే ప్రతిరోజూ తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల బరువును తగ్గించవచ్చు.పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియా జీర్ణక్రియను మెరుగుపరచి బరువును నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. కానీ పీసీఓఎస్ ఉన్నవారిలో ఈ మంచి బ్యాక్టీరియా తక్కువగా ఉంటుంది. అందుకే పెరుగు, చద్దన్నం, పచ్చళ్ళు, ఇడ్లీ, దోసె లాంటి పులియబెట్టిన పదార్థాలు తీసుకోవడం మంచిది.ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఎక్కువసేపు ఆకలేయదు. ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. హార్మోన్ల సమతుల్యత కూడా చక్కబడుతుంది. ఫలితంగా బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి. ఓట్స్, బ్రొకోలి, అవకాడో, బెర్రీస్, తృణధాన్యాలు, యాపిల్స్ వంటి ఫలాలు తినడం మంచిది.పీసీఓఎస్ ఉన్నవారిలో శరీర వాపు ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలంగా వాపు ఉండడం వల్ల బరువు పెరగడం జరుగుతుంది. దీన్ని తగ్గించేందుకు మెడిటెరేనియన్ డైట్ ఉపయోగపడుతుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె వంటివి ఉండాలి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను ఆహారంలో చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. కొవ్వులంటే బరువు పెరుగుతుందనే భయం చాలా మందిలో ఉంటుంది. కానీ మంచి కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి. అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, కొబ్బరి నూనె వంటివి తినడం వల్ల ఆకలిని తగ్గించవచ్చు. దీని వలన బరువు తగ్గడం సులభమవుతుంది. కేవలం క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉండాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు లాంటి ప్రోటీన్ ఉన్న ఆహారం తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. ప్రతివారం కనీసం మూడు రోజులు బరువులెత్తే వ్యాయామాలు చేయడం వల్ల నడుము చుట్టూ ఉన్న కొవ్వు కరిగిపోతుంది. పూర్తి నిద్ర, ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయడం వల్ల కూడా బరువు తగ్గడంలో సహాయం చేస్తాయి.

మన దునియా
RNI Number
మన అక్షరం – మన ప్రపంచం

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?

కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా,




పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.


## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే టీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శు భ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ఐస్ ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.


## తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది.2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది.3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## అందం కోసం విలువైన రహస్యం పటిక

పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది.



పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# సొంతగడ్డపై సన్ రైజర్స్ హ్యాట్రిక్... ఢిల్లీపై అద్భుత విజయం

**హైదరాబాద్‌లో పరుగుల వరద.. ఢిల్లీపై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ విజయం**

**విధ్వంసకర సెంచరీతో అదరగొట్టిన ఓపెనర్ అభిషేక్ శర్మ**

**బౌలింగ్‌లో మలింగ, హర్ష్ దూబే మాయ**

**ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరిన ఎస్‌ఆర్‌హెచ్**

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. సొంత మైదానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ పరుగుల సునామీ సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ అజేయ, విధ్వంసకర శతకంతో కదం తొక్కడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ కు ఇది వరుసగా మూడో విజయం. ఈ విజయంతో ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ బ్యాటింగ్ ప్రదర్శన విధ్వంసక రీతిలో సాగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలింగ్ ను ఊచకోత కోశాడు. కేవలం 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37), ఇషాన్ కిషన్ (25) వేగంగా ఆడగా, చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది.భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ, క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. నితీశ్ రాణా (30 బంతుల్లో 57), సమీర్ రిజ్వీ (41), కేఎల్ రాహుల్ (37) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ పేసర్ ఎషాన్ మలింగ తన పదునైన బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. కీలకమైన డేవిడ్ మిల్లర్ (0), ట్రిస్టన్ స్టబ్స్ (27) సహా మొత్తం 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. మరోవైపు, యువ స్పిన్నర్ హర్ష్ దూబే తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు. కేవలం 2 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ ఓటమిని ఖాయం చేశాడు. దీంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులకే పరిమితమైంది.ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 7 మ్యాచ్‌లలో 4 విజయాలు, 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడం ఆరెంజ్ ఆర్మీ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.



# టీ20 ఫార్మాట్‌లో కోహ్లీ రికార్డు సమం చేసిన అభిషేక్


**టీ20ల్లో తొమ్మిదో సెంచరీతో చెలరేగిన అభిషేక్ శర్మ**

**అత్యధిక శతకాలు బాదిన భారతీయుడిగా విరాట్ కోహ్లీ రికార్డు సమం**

**సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున 2,000 పరుగుల మైలురాయి పూర్తి**

**ఫ్రాంచైజీకి 100కు పైగా సిక్సర్లు కొట్టిన రెండో బ్యాటర్‌గా ఘనత**

సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ ఓపెనర్ అభిషేక్ శర్మ టీ20 ఫార్మాట్‌లో సరికొత్త సంచలనం సృష్టించాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో కదం తొక్కాడు. ఈ శతకంతో, అత్యధిక టీ20 సెంచరీలు సాధించిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు.ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ ఆకాశమే హద్దుగా చెలరేగి, తన ఐపీఎల్ కెరీర్‌లో రెండో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అభిషేక్‌కు ఇది తొమ్మిదో సెంచరీ కావడం విశేషం. ఈ ఘనతతో కోహ్లీ సరసన నిలిచాడు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే క్రిస్ గేల్ (22), బాబర్ అజమ్ (12), డేవిడ్ వార్నర్ (10) మాత్రమే వీరిద్దరి కంటే ముందున్నారు. ఈ ఇన్నింగ్స్‌తో అభిషేక్ పలు ఫ్రాంచైజీ రికార్డులను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున 2,000 పరుగుల మైలురాయిని దాటిన నాలుగో ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. గతంలో డేవిడ్ వార్నర్ (4,014), శిఖర్ ధావన్ (2,518), కేన్ విలియమ్సన్ (2,101) మాత్రమే ఈ ఘనత సాధించారు. అంతేకాకుండా, ఫ్రాంచైజీ తరఫున 100కు పైగా సిక్సర్లు బాదిన రెండో ఆటగాడిగా (వార్నర్ తర్వాత) రికార్డు సృష్టించాడు.మ్యాచ్‌కు ముందు టాస్ సమయంలో కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ పిచ్ నెమ్మదించే అవకాశం ఉందని అంచనా వేశాడు. కానీ అభిషేక్ విధ్వంసకర బ్యాటింగ్ చూస్తే పిచ్‌పై ఎలాంటి ఇబ్బందులు లేనట్లే కనిపించింది. ఈ ప్రదర్శనతో పొట్టి ఫార్మాట్‌లో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు.



# అభిషేక్ శర్మ సెంచరీ పూర్తయ్యాక కావ్య పాప రియాక్షన్ వైరల్!



**ఉప్పల్‌లో అభిషేక్ శర్మ అద్భుత సెంచరీ**

**శతకం తర్వాత కావ్య మారన్ రియాక్షన్ సోషల్ మీడియాలో వైరల్**

**135 పరుగులతో అజేయంగా నిలిచిన యువ ఓపెనర్**

**టీ20ల్లో అత్యధిక సెంచరీల కోహ్లీ రికార్డు సమం**

**ఢిల్లీ ముందు 243 పరుగుల భారీ లక్ష్యం**

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్ హెచ్) యువ ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి విధ్వంసకర శతకంతో కదం తొక్కాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ తర్వాత, సన్‌రైజర్స్ యజమాని కావ్య మారన్ ఇచ్చిన రియాక్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిషేక్ శతకం పూర్తి చేయగానే స్టాండ్స్‌లో ఉన్న కావ్య చప్పట్లతో అభినందిస్తూ ఎంతో ఉత్సాహంగా కనిపించారు. చిన్న పిల్లలా కేరింతలు కొట్టారు. ఆమె సంతోషానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.వివరాల్లోకి వెళ్తే, హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 47 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి, మొత్తం మీద 135 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏకంగా 10 సిక్సర్లు ఉండటం విశేషం. ఐపీఎల్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో 10 సిక్సర్లు కొట్టిన రెండో ఆటగాడిగా నిలిచాడు.ఈ సెంచరీతో అభిషేక్ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ (9) రికార్డును సమం చేశాడు. అలాగే, ఐపీఎల్ చరిత్రలో ఇది ఐదో అత్యధిక వ్యక్తిగత స్కోరు. సన్‌రైజర్స్ తరఫున 2,000 ఐపీఎల్ పరుగులు పూర్తి చేసుకున్న ఆటగాళ్ల జాబితాలో డేవిడ్ వార్నర్, శిఖర్ ధావన్, కేన్ విలియమ్సన్ సరసన చేరాడు.అభిషేక్‌కు మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37) మంచి ఆరంభాన్ని ఇవ్వగా, చివర్లో హెన్రిచ్ క్లాసెన్ కేవలం 13 బంతుల్లోనే 37 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరి ధాటికి సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరు సాధించింది.

# కోహ్లీ 'టేస్ట్'పై ఇన్‌స్టా పోస్ట్.. అసహనం వ్యక్తం చేసిన మాజీ గాళ్ ఫ్రెండ్!

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి సోషల్ మీడియాలో వార్తల్లో నిలిచాడు. అయితే ఈసారి ఆట గురించి కాదు, తన పాత ప్రేమ వ్యవహారం గురించి. కోహ్లీకి సంబంధించిన ఓ వైరల్ పోస్ట్‌పై అతడి మాజీ ప్రియురాలు, బ్రెజిలియన్ నటి ఇజాబెల్ లీట్ స్పందించడంతో ఈ విషయం చర్చనీయాంశమైంది.విరాట్ కోహ్లీకి సంబంధం ఉన్న మహిళల ఫోటోలతో ఓ ఇన్‌స్టాగ్రామ్ పేజీ కొలాజ్ క్రియేట్ చేసింది. అందులో అతడి భార్య అనుష్క శర్మ, మాజీ ప్రేయసి ఇజాబెల్ లైట్, ఇటీవల కోహ్లీ లైక్ చేసిన జర్మన్ ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్, నటి అవ్నీత్ కౌర్ ఫోటోలు ఉన్నాయి. "ఫీల్డ్‌లో, ఆఫ్ ఫీల్డ్‌లో కోహ్లీ అస్సలు మిస్ అవ్వడు. అతడి టేస్ట్ చాలా ఎలైట్‌గా ఉంటుంది" అంటూ ఆ పోస్ట్‌కు క్యాప్షన్ పెట్టారు.ఈ పోస్ట్ చూసిన ఇజాబెల్ తన అసహనాన్ని వ్యక్తం చేసింది. తన ఫోటోను కోహ్లీతో లింకప్ చేస్తూ కొలాజ్ ఫోటో పెట్టడం పట్ల అభ్యంతరం వెలిబుచ్చింది. "ఇది జరిగి (కోహ్లీతో అఫైర్) 12 ఏళ్లు గడిచాయి. ప్రజలు ఇంకా దీన్ని ఎందుకు మర్చిపోలేకపోతున్నారు?" అని ఆమె కామెంట్ రూపంలో ప్రశ్నించింది. ఆమె వ్యాఖ్యకు చాలా మంది నెటిజన్లు మద్దతు పలికారు. ఇటీవల విరాట్.. జర్మన్ ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ ఫోటోను ఇన్‌స్టాలో లైక్ చేసి, వెంటనే అన్‌లైక్ చేశారు. గతంలో అవ్నీత్ కౌర్ ఫోటోను లైక్ చేసినప్పుడు అది 'అల్గారిథమ్ ఎర్రర్' అని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే తాజా పోస్ట్ వైరల్ అయింది.ఇజాబెల్ లీట్ 2014లో విరాట్‌తో రెండేళ్లు డేటింగ్ చేసినట్లు ధృవీకరించారు. అనంతరం 2017లో కోహ్లీ, అనుష్క శర్మను వివాహం చేసుకోగా, వారికి వామిక, అకాయ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఈ వైరల్ పోస్ట్, దానిపై ఇజాబెల్ స్పందన సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# అల్లు అర్జున్ పేరు, ఫొటోల వాడకంపై ఢిల్లీ హైకోర్టు నిషేధం



అల్లు అర్జున్ పేరు, వాయిస్, ఫొటోల ముందస్తు అనుమతి లేని వాడకంపై నిషేధం

వ్యాపార అవసరాల కోసం ఐకాన్ స్టార్ గుర్తింపును వాడుకోవడంపై మధ్యంతర ఉత్తర్వులు

అభ్యంతరకరమైన వెబ్‌సైట్లు, లింకులను 72 గంటల్లో తొలగించాలని ఆదేశం

ఇటీవలి కాలంలో పర్సనాలిటీ రైట్స్ కోసం కోర్టును ఆశ్రయిస్తున్న పలువురు ప్రముఖులు

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, ఫొటో, వాయిస్‌తో పాటు ఇతర వ్యక్తిగత గుర్తింపులను ముందస్తు అనుమతి లేకుండా వ్యాపార అవసరాలకు వాడుకోవడంపై న్యాయస్థానం మధ్యంతర నిషేధం విధించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీల ద్వారా అల్లు అర్జున్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న పలు సంస్థలు, వెబ్‌సైట్లపై కఠిన ఆంక్షలు జారీ చేసింది. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, కొన్ని వెబ్‌సైట్లు అక్రమంగా తన ఫొటోలతో కూడిన వస్తువులను విక్రయిస్తున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా తన వాయిస్‌ను క్లోన్ చేసి ఫేక్ కాల్స్ సృష్టిస్తున్నారని తెలుపుతూ అల్లు అర్జున్ కోర్టును ఆశ్రయించారు. తన ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్న అసభ్యకరమైన కంటెంట్‌ను కూడా ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ తుషార్ రావు గెడెలతో కూడిన సింగిల్ జడ్జి ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. “విజేత“ సినిమాలో బాలనటుడిగా మొదలైన ఆయన ప్రయాణం “పుష్ప“ సిరీస్‌తో జాతీయ స్థాయికి చేరిందని, ఆయనో కమర్షియల్ సక్సెస్ సాధించిన గౌరవప్రదమైన నటుడని న్యాయమూర్తి ప్రశంసించారు. అల్లు అర్జున్ పేరు, ఆహార్యం, వాయిస్, డైలాగ్ డెలివరీ, సిగ్నేచర్ వంటివి ఆయనకు మాత్రమే ప్రత్యేకమైనవని స్పష్టం చేశారు. వీటిని అనుమతి లేకుండా వాడితే ఆయనకు తీరని నష్టం వాటిల్లుతుందని కోర్టు అభిప్రాయపడింది. అల్లు అర్జున్ గుర్తింపును ఉపయోగించి ఏఐ జనరేటెడ్ డీప్‌ఫేక్స్, ఫేస్ మార్ఫింగ్ వంటివి సృష్టించకూడదని, ఆయన ఫొటోలతో దుస్తులు, పోస్టర్లు అమ్మకూడదని కోర్టు స్పష్టం చేసింది. అభ్యంతరకరంగా ఉన్న లింకులు, వెబ్‌సైట్లను 72 గంటల్లోగా తొలగించాలని సంబంధిత సంస్థలను ఆదేశించింది. తదుపరి విచారణను జులై 14, సెప్టెంబర్ 24వ తేదీలకు వాయిదా వేసింది. కాగా, ఇటీవలి కాలంలో తమ పర్సనాలిటీ రైట్స్‌ను కాపాడుకునేందుకు గౌతమ్ గంభీర్, నాగార్జున, కాజోల్, ఐశ్వర్య రాయ్, సునీల్ గవాస్కర్ తదితర ప్రముఖులు కూడా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి రక్షణ పొందారు.

# ఇక ఆరు రోజులే... చివరి దశకు రామ్ చరణ్ ‘పెద్ది‘ షూటింగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న ‘పెద్ది‘ సినిమా షూటింగ్ చివరి అంకానికి చేరుకుంది. ఈ సినిమా చిత్రీకరణ మరో 6 రోజుల్లో పూర్తవుతుందని దర్శకుడు బుచ్చిబాబు స్వయంగా వెల్లడించారు. రామ్ చరణ్‌తో సెట్స్‌లో దిగిన సెల్ఫీని పంచుకుంటూ, “నాకు అత్యంత స్ఫూర్తినిచ్చిన పాత్ర.. నేను ప్రేమించే పెద్ది“ అంటూ ఆయన తన అభిమానాన్ని చాటుకున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ఒక రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా. ఇందులో రామ్ చరణ్ ‘పెద్ది‘ అనే టైటిల్ రోల్‌లో, మునుపెన్నడూ చూడని రఫ్ అండ్ రస్టిక్ అవతార్‌లో పహిల్వాన్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం చరణ్ ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. ఆయన సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం విశేషం. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇటీవలే ఈ సినిమాలోని టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ప్రకటించింది. ఇప్పుడు ఆ చివరి పాట చిత్రీకరణ కూడా ముగింపు దశకు రావడంతో, పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసి, సినిమాను 2026 జూన్‌లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# నేను మలయాళీని కాదు.. తమిళ అమ్మాయిని: పాత వివాదంపై సాయి పల్లవి

తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారని గతంలో సాయి పల్లవికి ప్రశ్న

తాను తమిళ అమ్మాయిని అని తెలిపిన పల్లవి

తన మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పానన్న పల్లవి

ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం తనకు లేదని వ్యాఖ్య

టాలెంట్, సహజమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సాయి పల్లవి, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన ‘రామాయణ’ చిత్రంలో సీతగా నటిస్తూ బిజీగా ఉంది. అయితే, కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా, గతంలో తాను చేసిన ఒక వ్యాఖ్యను కొందరు వక్రీకరించడంపై తాజాగా ఆమె స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. అసలు ఏం జరిగిందంటే... దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో, “మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?“ అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి సాయి పల్లవి సమాధానమిస్తూ, “నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు“ అని స్పష్టం చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత కొందరు ఈ మాటలను వక్రీకరించి, “మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది“ అంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ ప్రచారంపై తాజాగా ఆమె స్పందిస్తూ.. “ఆ హెడ్‌లైన్ చూసి నేను షాక్‌కు గురయ్యాను. నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం. నేను కోయంబత్తూరులో పుట్టి పెరిగాను, నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం నాకు లేదు“ అని సాయి పల్లవి వివరణ ఇచ్చింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com